పెర్రీ ఆల్‌రౌండ్ షో

ఆరు వికెట్లతో విజృంభణ • ముంబైపై బెంగళూరు ఘన విజయం • డబ్ల్యూపీఎల్‌లో ప్లేఆఫ్స్ బెర్తు ఖరారు

మహిళల ప్రీమియర్ లీగ్(డబ్ల్యూపీఎల్)లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) దుమ్మురేపింది. గెలిస్తే గానీ ప్లేఆఫ్ బెర్తు ఖరారు కానీ నేపథ్యంలో జూలు విదిల్చింది. గత మ్యాచ్‌లో పరుగు తేడాతో ఢిల్లీకి మ్యాచ్ చేజార్చుకున్న మందనసేన..డిఫెండింగ్ చాంపియన్ ముంబై ఇండియన్స్‌కు దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. ఎలీస్ పెర్రీ ఆరు వికెట్ల విజృంభణతో ముంబై 113 పరుగులకే కుప్పకూలింది. లక్ష్యఛేదనలోనూ బ్యాటు ఝుళిపించిన పెర్రీ.. రీచా ఘోష్‌తో కలిసి జట్టును ప్లేఆఫ్స్‌కు చేర్చింది. ఆల్‌రౌండ్ షోతో పెర్రీ ఆర్‌సీబీ విజయంలో కీలకమైంది.

పెర్రీ (6/15, 40*)

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్‌లో మ్యాచ్‌లు హోరాహోరీగా సాగుతున్నాయి. ఐపీఎల్‌కు ఏ మాత్రం తీసిపోకుండా జరుగుతున్న లీగ్‌లో అమ్మాయిలు అదరగొడుతున్నారు. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో బెంగళూరు 7 వికెట్ల తేడాతో ముంబైపై అద్భుత విజయం సాధించింది. దీని ద్వారా లీగ్‌లో తొలిసారి ప్లేఆఫ్ బెర్తు దక్కించుకుంది. ముంబై నిర్దేశించిన 114 పరుగుల లక్ష్యాన్ని బెంగళూరు 15 ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసింది. ఎలీస్ పెర్రీ(40 నాటౌట్), రీచా ఘోష్(36 నాటౌట్) బెంగళూరును గెలిపించారు. షబ్నమ్, మాథ్యూస్, బ్రంట్‌కు ఒక్కో వికెట్ దక్కింది. అంతకు ముందు పెర్రీ(6/15) ధాటికి ముంబై 19 ఓవర్లలో 113 పరుగులకే కుప్పకూలింది. సంజీవన్ సంజన(30), మాథ్యూస్(26) రాణించగా, మిగతావారు ఘోరంగా విఫలమయ్యారు. మంచి ఫామ్‌మీదున్న కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కౌర్(0) గోల్డెన్ డకౌట్‌గా వెనుదిరిగింది. మిలోనిక్స్, డివైన్, శోభన, శ్రేయాంక ఒక్కో వికెట్ ఖాతాలో వేసుకున్నారు. ఆరు వికెట్లకు తోడు అజేయంగా నిలిచిన పెర్రీకి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

పెర్రీ ప్రదర్శన అదుర్స్:
ప్లేఆఫ్స్ బెర్తు దక్కించుకోవాలంటే కచ్చితంగా గెలువాల్సిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ సమిష్టి ప్రదర్శన కనబరిచింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న కెప్టెన్ స్మృతి మందన నమ్మకాన్ని ఆర్‌సీబీ బౌలర్లు నిలబెట్టారు. ముంబై ఓపెనర్లు మాథ్యూస్, సంజన మెరుగైన శుభారంభాన్ని ఇచ్చారు. డివైన్ వేసిన ఇన్నింగ్స్ ఆరో ఓవర్లో మాథ్యూస్..పెర్రీకి క్యాచ్ ఇచ్చి వెనుదిరిగింది. దీంతో తొలి వికెట్‌కు 43 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత 22 పరుగుల తేడాతో సంజన కూడా ఔట్ కావడంతో ముంబై కష్టాలు మొదలయ్యాయి. అప్పటి వరకు కుదురుగానే ముంబై..పెర్రీ రంగప్రవేశంతో సీన్ పూర్తిగా మారిపోయింది. వచ్చి రావడంతోనే సంజనను పెవిలియన్ పంపిన పెర్రీ..హర్మన్‌ప్రీత్‌కౌర్(0), అమెలియా కెర్(2), అమన్‌జ్యోత్ కౌర్(4), పూజ వస్త్రాకర్(6), బ్రంట్(10) వరుస విరామాల్లో పెవిలియన్ పంపి ముంబైని కోలుకోని దెబ్బ కొట్టింది. పెర్రీ పేస్ బౌలింగ్ ధాటికి ముంబై ఏ దశలోనూ కోలుకోలేకపోయింది. ఆఖర్లో ప్రియాంక(19 నాటౌట్) బ్యాటు ఝుళిపించినా లాభం లేకపోయింది. ఈ క్రమంలో లీగ్‌లో అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనను పెర్రీ తన పేరిట లిఖించుకుంది. మరోవైపు ముంబై తమ రెండో అత్యల్ప స్కోరును మూటగట్టుకుంది.

పెర్రీ, రీచా నిలకడగా:
ముంబై నిర్దేశించిన స్వల్ప లక్ష్యఛేదనలో బెంగళూరకు మెరుగైన శుభారంభం దక్కలేదు. కెప్టెన్ మందన(11), మిలోనెక్స్(9) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. ఈ తరుణంలో పెర్రీ, రీచా ఘోష్ ఇన్నింగ్స్ బాధ్యతను భుజానెత్తుకున్నారు. ముఖ్యంగా పెర్రీ..తను అనుభవాన్ని ఉపయోగిస్తూ ముంబై బౌలింగ్ దాడిని సమర్థంగా ఎదుర్కొంది. తన ఇన్నింగ్స్‌లో ఐదు ఫోర్లు, భారీ సిక్స్ కొట్టిన పెర్రీకి..రీచా చక్కని సహకారం అందించింది. మరోవైపు తానేం తక్కువ కాదన్నట్లు రీచా కూడా చెలరేగడంతో బెంగళూరు గెలుపు సులువైంది.

1 డబ్ల్యూపీఎల్‌లో ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించడంఆర్‌సీబీకి ఇది తొలిసారి.

మంబైతో జరిగిన మ్యాచ్‌లో ఆర్‌సీబీ పేసర్ ఎలీస్ పెర్రీ(6/15) ఆరు వికెట్లతో విజృంభించింది. లీగ్‌లో ఇది అత్యుత్తమ ప్రదర్శనగా నమోదైంది.

సంక్షిప్త స్కోర్లు
ముంబై: 19 ఓవర్లలో 113 ఆలౌట్ (సంజన 30, మాథ్యూస్ 26, పెర్రీ 6/15, శ్రేయాంక 1/3), **బెంగళూరు:** 15 ఓవర్లలో 115/3(పెర్రీ 40 నాటౌట్, రీచా 36 నాటౌట్, మాథ్యూస్ 1/11, బ్రంట్ 1/18)

సింధు ముందంజ

ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌షిప్

బర్మింగ్‌హామ్: ప్రతిష్ఠాత్మక ఆల్ ఇంగ్లండ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు ముందంజ వేసింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో సింధు 21-10తో ఆధిక్యంలో ఉన్న దశలో ప్రత్యర్థి షట్లర్ యునో లీ(జర్మనీ) రిటైర్డ్‌గా వెనుదిరిగింది. దీంతో సింధు రెండో రౌండ్‌లోకి ప్రవేశించింది. తదుపరి రౌండ్‌లో కొరియా షట్లర్ అన్ సె యంగ్‌తో తలపడుతుంది. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో ప్రణయ్ 21-14, 13-21, 13-21తో సు లి యంగ్(చైనీస్ తైపీ) చేతిలో ఓడి నిష్క్రమించాడు.

నిశాంత్ నిష్క్రమణ

బుస్టో అర్సిజియో (ఇటలీ): ఒలింపిక్ క్వాలిఫయర్స్ టోర్నీలో భారత పోరాటం ముగిసింది. సెమీఫైనల్ బెర్తుతో విశ్వక్రీడల బెర్తు దక్కించుకుంటాడనుకున్న యువ బాక్సర్ నిశాంత్‌దేశ్ నిరాశపరిచాడు. మంగళవారం జరిగిన పురుషుల 71కిలోల క్వార్టర్స్‌లో నిశాంత్‌దేవ్ 1-4 తేడాతో ఒమరి జోన్స్(అమెరికా) చేతిలో ఓటమిపాలయ్యాడు. హోరాహోరీగా సాగిన పోరులో నిశాంత్ పోరాటపటిమ కనబర్చినప్పటికీ అమెరికా బాక్స ర్ దీటుగా బదులివ్వడంతో ఓటమి ఎదుర్కొవాల్సి వచ్చింది.

భారత్ @ 4

హాకీ ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ: అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ర్యాంకింగ్స్‌లో భారత్ నాలుగో ర్యాంక్‌కు పడిపోయింది. ఆసియాగేమ్స్‌లో స్వర్ణం ద్వారా ఇప్పటికే పారిస్ ఒలింపిక్స్ బెర్తు దక్కించుకున్న టీమ్‌ఇండియా ప్రస్తుతం 2760 పాయింట్లతో నాలుగో ర్యాంక్‌లో నిలిచింది. ఎఫ్ఐహెచ్ టోర్నీల్లో మెరుగైన ప్రదర్శనతో జర్మనీ (2785) మూడో ర్యాంక్‌కు చేరుకుంది. నెదర్లాండ్స్ (3060), బెల్జియం (2848) తొలి రెండు ర్యాంక్‌ల్లో ఉన్నాయి

దత్తతకు స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు

ముందుకొచ్చిన గోపీచంద్ ఫౌండేషన్

సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: జీహెచ్ఎంసీ పరిధిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లకు మహర్దశ పట్టనుంది. కార్పొరేట్ సోషల్ రెస్పాబులిటీ (సీఎస్ఆర్) కింద పుల్లెల గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లను దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చింది. నిర్వహణ కింద జీహెచ్ఎంసీతో ఎంవోయూ కుదుర్చుకోనుంది. 12 నెలల పాటు నిర్వహణతో పాటు ఉచితంగా ఆయా క్రీడలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు బుధవారం మేయర్ గద్వాల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగే జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీలో చర్చించి ఆమోదించనున్నారు.

ముషీర్ అదుర్స్

ముంబై రెండో ఇన్నింగ్స్ 418 ఆలౌట్

విదర్భ లక్ష్యం 538, ప్రస్తుతం 10/0

ముషీర్‌ఖాన్ (136)

ముంబై: వాంఖడే స్టేడియం వేదికగా ముంబై, విదర్భ మధ్య జరుగుతున్న రంజీ ట్రోఫీ టైటిల్ పోరు రసవత్తరంగా సాగుతున్నది. రికార్డు స్థాయిలో 42వ టైటిల్‌పై కన్నేసిన ముంబై ఆ దిశగా అడుగులు ముందుకు వేస్తున్నది. ముంబై నిర్దేశించిన 538 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో విదర్భ మూడో రోజు ఆట ముగిసే సరికి విదర్భ వికెట్ నష్టపోకుండా 10 పరుగులు చేసింది. ఓపెనర్లు అథర్వ (3), ధృవ్ షోరె(7) క్రీజులో ఉన్నారు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు141/2 రెండో ఇన్నింగ్స్‌కు దిగిన ముంబై 418 పరుగులకు ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్లు ముషీర్‌ఖాన్ (326 బంతుల్లో 136, 10ఫోర్లు), కెప్టెన్ రహానే (73) రాణించారు. తన స్కోరుకు 15 పరుగులు జత చేసిన రహానే మూడో వికెట్‌గా వెనుదిరుగగా, శ్రేయాస్ అయ్యర్ (95)..ముషీర్‌ఖాన్‌కు జతకలిశాడు. వీరిద్దరు విదర్భ బౌలింగ్‌ను తుత్తునియలు చేస్తూ స్కోరుబోర్డును పరిగెత్తించారు. ముఖ్యంగా మంచి ఫామ్‌మీదున్న ముషీర్..మైదానం నలువైపులా చూడచక్కని షాట్లతో అలరించాడు. ఈ జోడీని విడదీసేందుకు విదర్భ ఎన్ని రకాలుగా ప్రయత్నించినా లాభం లేకపోయింది. 19 ఏండ్ల ముషీర్ అద్భుతమైన పరిణతి కనబరుస్తూ అయ్యర్‌తో కలిసి సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఐదు పరుగుల తేడాతో అయ్యర్ శతకం చేజార్చుకోగా, నాలుగో వికెట్‌కు 168 పరుగుల భాగస్వామ్యానికి బ్రేక్ పడింది. ఆ తర్వాత శమ్స్ ములానీ (50 నాటౌట్) అర్ధసెంచరీతో ముంబై భారీ స్కోరు అందుకుంది. హర్ష్ దూబే(5/144) ఐదు వికెట్లతో విజృంభించాడు. ఈ మ్యాచ్‌కు క్రికెట్ దిగ్గజం సచిన్‌తో పాటు కెప్టెన్ రోహిత్ శర్మ హాజరయ్యాడు.

పంత్ ఫిట్

ఐపీఎల్‌కు షమీ, ప్రసిద్ధ్ దూరం

న్యూఢిల్లీ: యువ వికెట్‌కీపర్, బ్యాటర్ రిషబ్ పంత్ పూర్తి ఫిట్‌నెస్ సాధించాడు. సరిగ్గా 14 నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ పంత్ పూర్తి ఫిట్‌నెస్ సాధించినట్లు బీసీసీఐ మంగళవారం పేర్కొంది. దీంతో త్వరలో మొదలయ్యే ఐపీఎల్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు పంత్ కెప్టెన్‌గా వ్యవహరించే అవకాశముంది. గాయాల నుంచి ఇంకా కోలుకోకపోవడంతో పేసర్లు మహమ్మద్ షమీ, ప్రసిద్ధ్ కృష్ణ ఐపీఎల్‌కు దూరమైనట్లు బోర్డు పేర్కొంది.

పావనికి కాంస్యం

పారా షూటింగ్ ప్రపంచకప్

న్యూఢిల్లీ: ప్రతిష్ఠాత్మక పారా షూటింగ్ ప్రపంచకప్‌లో తెలంగాణ యువ షూటర్ బానోత్ పావని కాంస్య పతకంతో మెరిసింది. మంగళవారం జరిగిన ఆర్11 మిక్స్‌డ్ టీమ్ 10మీటర్ల ఎయిర్ రైఫిల్ ఎస్‌హెచ్2 ఈవెంట్‌లో పావని, శ్రీధర్ కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. కాంస్య పోరులో భారత్ 17-15 తేడాతో న్యూజిలాండ్‌పై విజయం సాధించింది. ఇదే విభాగంలో బ్రెజిల్ స్వర్ణం, అమెరికా రజత పతకం గెలుచుకున్నాయి. మరోవైపు మిక్స్‌డ్ 10మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో రుద్రాంశ్ ఖండేల్‌వాల్(364), ఆకాశ్(346), సందీప్(340)తో కూడిన భారత త్రయం పసిడి పతకంతో మెరిసింది. కొరియా, చైనా రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నాయి.

జైస్వాల్‌కు ఐసీసీ అవార్డు

దుబాయ్: భారత యువ క్రికెటర్ యశస్వి జైస్వాల్..ఐసీసీ 'ప్లేయర్ ఆఫ్ ద మంత్' అవార్డును కైవసం చేసుకున్నాడు. ఇటీవల ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లో 712 పరుగులు చేయడం ద్వారా భారత విజయంలో జైస్వాల్ కీలకంగా వ్యవహరించాడు. సిరీస్‌లో రెండు డబుల్ సెంచరీలతో అదరగొట్టిన జైస్వాల్ మూడు అర్ధసెంచరీలు సాధించాడు. ఈ క్రమంలో పలు రికార్డులు కొల్లగొట్టాడు. సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ సరసన జైస్వాల్ నిలిచాడు. తనకు అవార్డు రావడంపై జైస్వాల్ స్పందిస్తూ 'ఐసీసీ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు సాధిస్తానన్న నమ్మకం నాకుంది. నా కెరీర్‌లో మరిచిపోలేని సిరీస్ ఇది. సహచరులతో కలిసి సిరీస్ విజయంలో భాగం కావడం గర్వంగా ఉంది' అని అన్నాడు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.